క్లుప్తంగా

వేడుకగా దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన



నల్లబెల్లి : మండలంలోని అర్వయ్యపల్లిలో నిర్మించిన ఆలయంలో దుర్గామాత విగ్రహాన్ని శనివారం వేడుకగా ప్రతిష్ఠించారు. పురోహితుడు కరుణాకర్ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించగా ప్రతిష్టాపన కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, నాయకులు మాలోత్ ప్రతాప్‌సింగ్, చరణ్‌సింగ్, జర్పుల రమేశ్, దుంపల ఇంద్రారెడ్డి, వర్ణం ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



సాక్షి నెట్‌వర్క్ : నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం కొనసాగాయి. నర్సంపేటలోని పదో వార్డు పరిధిలోని పోచమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు నిశాంత్‌శర్మ పూజలు నిర్వహించగా స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, పోచమ్మతల్లి మహిళా ఉత్సవ కమిటీ బాధ్యులు పూజలో పాల్గొన్నారు. దుగ్గొండి మండలంలోని నాచినపల్లి గ్రామంలోని విశ్వకర్మ వీధిలోని దుర్గామాత విగ్రహానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్, బుధరావుపేట, కొత్తూరు, ఖానాపురం, తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు కొనసాగాయి. చెన్నారావుపేట మండల కేంద్రంలోని శ్రీ సిద్ధేశ్వరాలయంలో అమ్మవారు గాయత్రి మాత అలంకరణలో దర్శనమిచ్చింది.

వేడుకగా బతుకమ్మ



దుగ్గొండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ కోలాటాలు వేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, డిప్యూటీ తహసీల్దార్ ఉమారాణి, సీనియర్ అసిస్టెంట్ రేణుకాదేవి, పంచాయతీ కార్యదర్శులు కవిత, రజని, ఫీల్డ్ అసిస్టెంట్లు జయ, స్వర్ణ, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

బిట్స్‌లో..



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారు బిట్స్ కళాశాలలో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను నిర్వహించారు. వేడుకలను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. బతుకమ్మలను విద్యార్థులు, అధ్యాపకులు తీసుకొచ్చి ఆడిపాడారు. జమ్మి పూజ, రావణాసుర వధ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిహరన్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఏఓ సురేశ్, ఫణీందర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి సదస్సును జయప్రదం చేయాలి

నర్సంపేట : పట్టణంలోని సిటిజన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో నేడు (ఆదివారం) తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతోపాటు కుల, ప్రజాసంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొని 736 రోజుల పాటు అంబేడ్కర్ సెంటర్‌లో దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు జావిద్, గుడిపూడి అరుణ, ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, కల్లెపల్లి ప్రణయ్‌దీప్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో నల్లా పైపులైన్ గేట్‌వాల్వ్

- లీకేజీ ఏర్పడితే కలుషిత నీరే సరఫరా
- సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : జనానికి నల్లా నీటిని అందించేలా పైపులైన్ వేశారు. ఎగువ, దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా కోసం జంక్షన్ల వద్ద నల్లాకు గేట్‌వాల్వ్ ఏర్పాటు చేశారు. కాగా డ్రెయినేజీలోనే నల్లా పైపులైన్ గేట్‌వాల్స్ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని సర్వాపురం గ్రామంగా ఉన్న సమయంలో పాకాల రోడ్డు, వడ్డెర కాలనీకి నీటి సరఫరా చేస్తున్న క్రమంలో పాకాల రోడ్డుకు, వడ్డెరకాలనీలకు నల్లా నీరు రాక జనం తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితి ఉండేది. ఆ సమయంలో నాటి సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వడ్డెర కాలనీ కోసం ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేశారు. పాకాల రోడ్డు సైడ్ ఉన్న కాలనీకి నీళ్లు వస్తుండగా కింద సైడ్ ఇళ్లు పెరిగిపోతుండడంతో నల్లా కనెక్షన్లు పెరిగాయి. దీంతో కింద భాగంలో వంపు ఉండడంతో నీరంతా ఆ దిశగా ఉన్న ఇండ్లకే అందుతుండడంతో పైభాగంలో ఉన్న ఇళ్లకు నీరు అందకపోతుండడంతో నాటి కౌన్సిలర్ దారంగుల రజిత నగేశ్ ఆధ్వర్యంలో బ్యాంక్ సమీపంలో నల్లా పైపులైన్ గేట్‌వాల్వ్ ఏర్పాటు చేశారు. తద్వారా కింది, పై భాగాల్లోని ఇళ్లకు నీరందేలా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా సైడ్ డ్రైనేజీ నిర్మించడంతో సదరు నల్లా గేట్‌వాల్వ్ డ్రైనేజీ నడుమ ఉండిపోయింది. దీంతో మురుగునీరు పైపులైన్ గేట్‌వాల్వ్ చుట్టూ చేరుతోంది. నల్లా గేట్‌వాల్వ్‌కు లీకేజీ ఏర్పడితే మురుగునీరు కలిసి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం నెలకొంది. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రెయినేజీ మధ్యలో ఉన్న నల్లా గేట్‌వాల్వ్

సబ్‌మార్కెట్ ఆధునికీకరణకు కృషి



మార్కెట్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస్, తదితరులు

ఖానాపురం : మండల కేంద్రంలోని మార్కెట్ ఆధునికీకరణకు కృషి చేస్తున్నట్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తెలిపారు. స్థానిక సబ్ మార్కెట్ యార్డును శనివారం వారు సందర్శించి మాట్లాడారు. రోడ్డు నుంచి గోదాం వరకు రోడ్డు, బెడ్ల ఆధునీకరణకు కొలతల సేకరించడంతోపాటు ప్రహరీ, అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఆధునీకరణకు నోచుకోక మార్కెట్ యార్డులో అనేక సమస్యలు పేరుకుపోయాయని చెప్పారు. రైతులకు అవసరమైన మరిన్ని వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి రెడ్డినాయక్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముస్తఫా, నాయకులు బొబ్బ విద్యాసాగర్, దేవినేని వేణుగోపాల్‌రావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రాయపర్తి : మండలంలోని గ్రామాల అభివృద్ధికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెర్కవేడులో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న ఇతర సమస్యలను సైతం దశలవారీగా పరిష్కరిస్తారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తీగల సాయిలు, నాయకులు ఉల్లెంగుల నర్సయ్య, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పుల్లూరి దామోదర్, సుతారి యాదగిరి, మునిత, సేనాపతి, రాజేంద్రప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

గీసుకొండ : మండలంలోని కొనాయమాకులలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సొంత డబ్బుతో సమకూర్చిన యూనిఫారాలు శనివారం అందజేశారు. గతంలో ఆయన హామీని తాజాగా నెరవేర్చారు. విద్యార్థుల సంఖ్య బాగుందని అధ్యాపకులను అభినందించారు. మూత్రశాలల ఏర్పాటు కోసం రూ.20 లక్షల 40 వేలు మంజూరు చేసినట్లు చెప్పారు. కాలేజీ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ప్రిన్సిపాల్ అశోక్‌రావు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత



వైద్యశిబిరంలో డాక్టర్ సరోజ, ఎంపీడీఓ శ్రీవాణి

చెన్నారావుపేట : పరిసరాల శుభ్రతను సామాజిక బాధ్యతగా పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సరోజ, ఎంపీడీఓ శ్రీవాణి అభివర్ణించారు. మండలంలోని పుల్లయ్యబోడు తండాలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సరోజ, ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. పరిసరాల అపరిశుభ్రతతోనే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. నీటి నిల్వలు తొలగించాలని, వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలని, తదితర సూచనలు చేశారు. మండలంలోని ఉప్పరపల్లిలోని మురికిగుంతల్లో దోమల మందును పిచికారి చేయించారు. కార్యక్రమాల్లో ఎంపీఓ శ్రీధర్‌రాజు, హెల్త్ సూపర్‌వైజర్ కీర్య, రామెల్, సబ్ యూనిట్ ఆఫీసర్ నందా, వైద్య సిబ్బంది వెంకట్‌రెడ్డి, రమ, కాంతి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలి



గీసుకొండ : మాట్లాడుతున్న కవిరాజు



సంగెం : మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ఇందిర

గీసుకొండ : కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజు ఆకాంక్షించారు. మండలంలోని అనంతారంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు లింగ ఆధారిత హింస, మహిళల రక్షణ వ్యవస్థల అనుసంధానంపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా సంస్థ సేవలు అందిస్తోందని చెప్పారు. సోషల్ మీడియా ప్రభావంతో యువత వ్యసనాల బారిన పడుతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 27 వేల కుటుంబాల సమస్యలను పరిష్కరించినట్టు వివరించారు. మహిళలపై హింసను అరికట్టడానికి మహిళా సహాయత కమిటీలు కృషి చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వీఓఏ వెంకాయమ్మ, సంస్థ మండల ఫీల్డ్ ఆఫీసర్ అక్తర్, శ్రీనివాస్, రజిత, పద్మావతి, రాణి పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని బీకోజీనాయక్ తండాలో నిర్వహించిన సదస్సులో సర్వోదయ సంస్థ కోఆర్డినేటర్ ఇందిర మాట్లాడారు. కుటుంబ వ్యవస్థను బలోపేతానికి సమాజంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సఖీ వన్‌స్టాఫ్ సెంటర్ కౌన్సెలర్ తిరుమల, ఫీల్డ్ ఆఫీసర్ వనిత, ఆశ కార్యకర్తలు సుభద్ర, అనిత, అనూశ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో గ్రామ పంచాయతీ సిబ్బందికి మాచర్ల సంధ్య–అనిల్‌కుమార్ దంపతులు శనివారం రూ.10 వేల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొంత డబ్బుతో పంచాయతీ సిబ్బందికి దుస్తులు అందజేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సంధ్య–అనిల్‌కుమార్ దంపతులకు పంచాయతీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంద రమేశ్, మద్రి రాజలింగం, బత్తిని భాస్కర్, కూనూరు వీరభద్రం, పెరుమాండ్ల ప్రవీణ్, వీరగోని శరత్, సాయికృష్ణ, రఫీ, శ్రీనివాస్, ముత్తయ్య, కవిత, లక్ష్మి, రేణుక పాల్గొన్నారు.

అవయవదానం అభినందనీయం



రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న మోహన్‌దాస్

చెన్నారావుపేట : అవయవదానం అభినందనీయమని నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఇటీవల శరీర దానం చేసిన కొన్‌రెడ్డి అయిల్‌రెడ్డి సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయిల్‌రెడ్డి కుమారుడు రామ్మోహన్‌రెడ్డిని ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ సన్మానించి మాట్లాడారు. శరీరదానం వైద్యవిద్యార్థులకు ఉపకరించనుందని చెప్పారు. ఇద్దరు అంధులకు చూపునిచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, రాజమౌళి, శంకర్‌రావు, రాజేంద్రప్రసాద్, నవీన్‌కుమార్, రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హేచరీస్‌పై అధికారుల విచారణ

- మంచినీళ్ల చెరువు నీటి శాంపిల్ సేకరణ



హ్యాచరీస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాయపర్తి : మండల కేంద్రంలోని శ్రీ సత్యనారాయణస్వామి హేచరీస్‌పై అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్ నాయక్ హేచరీస్‌ను శనివారం సందర్శించారు. మంచినీళ్ల చెరువులో మూడు దిక్కుల శాంపిల్ సేకరించారు. వాటిని పరీక్షించనున్నారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. హ్యాచరీలో చేపట్టిన తాత్కాలిక చర్యలను పరిరక్షణ కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలిక ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు కలుషితమై చెరువులోని నీరు కలుషితమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాశ్, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, అనూష, పంచాయతీ కార్యదర్శి వినోద్, కిరణ్‌కుమార్, బాలదాసు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఔదార్యం



గీసుకొండ : మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని కొమ్మాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఆయన రూ.20 వేల సాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన మామునూరు శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.5 వేల నగదును పంపించారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన డబ్బును శ్రీనివాస్ కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో వీరగోని రాజ్‌కుమార్, గోనె మల్లారెడ్డి, మాదాసి రాంబాబు, కేలోతు స్వామి, దునికి కొమురయ్య, ఎడ్ల బాబు, వాంకుడోతు తిరుపతి, ఈర్ల ప్రవీణ్, కదారి రాజు, జన్ను రమేశ్, నాగారం స్వామి, మరకాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణంలో చైతన్యం కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్ అలీ

నర్సంపేట : సమసమాజ నిర్మాణంలో చైతన్యం కీలకమని, ఆ దిశగా పీడీఎస్‌యూ ముందుకు సాగుతోందని ఆ యూనియన్ మాజీ నాయకుడు, టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ మహబూబ్ అలీ తెలిపారు. పట్టణంలోని డఫోడిల్స్ స్కూల్‌లో ఆ యూనియన్ 50 వసంతాల సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన స్వర్ణోత్సవాలకు మహబూబ్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జంపాల జార్జిరెడ్డి ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యూనియన్ పురుడు పోసుకుందని, నాటి నుంచి విద్యార్థుల చైతన్యమే ప్రధాన ధ్యేయంగా పోరాడుతోందని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ మతోన్మాద శక్తుల తప్పుడు విధానాలను ఎండగట్టాలని కోరారు. కార్పొరేట్, మతోన్మాద శక్తుల నుంచి సమాజాన్ని కాపాడే దిశగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బండి కోటేశ్వర్, ఎలకంటి రాజేందర్, తోటకూర రాజు, కొండ వెంకన్న, లవకుమార్, రత్నం, రంజిత్, అభి పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : హోంగార్డుపై దురుసుగా ప్రవర్తించిన రౌడీషీటర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై గూడ అరుణ్ కథనం ప్రకారం.. నర్సంపేటలో శనివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రౌడీషీటర్ చంటి శ్రీకాంత్ అంగడి సెంటర్‌లో ఆటో నిలిపాడు. ఆటో తీయాలని హోంగార్డు చెప్పడంతో అతడి పట్ల రౌడీషీటర్ శ్రీకాంత్ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు శ్రీకాంత్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

గుట్కా, అంబర్ ప్యాకెట్ల పట్టివేత

దుగ్గొండి : మండల కేంద్రంలోని వెంకటేశ్వర కిరాణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడి చేసి రూ.16,100 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా, అంబర్ ప్యాకెట్లను పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. నిందితుడు పాగాకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

అంబులెన్స్ ఢీకొని ఇద్దరికి గాయాలు

దుగ్గొండి : అంబులెన్స్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గిర్నిబావి సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మహేశ్వరం గ్రామానికి చెందిన మిడిమాలపు మాధవ రెడ్డి, మధు కొమ్మాలలో శుభకార్యానికి వెళ్లి వస్తుండగా నర్సంపేట నుంచి వస్తున్న అంబులెన్స్ వినాయక ఇండస్ట్రీస్ వద్ద ఢీకొట్టింది. కాగా కారును తప్పించబోయిన క్రమంలోనే ద్విచక్ర వాహనాలను ఢీకొట్టినట్టు తెలిసింది. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన అంబులెన్స్ ఆపకుండా వెళ్లిపోగా అది నర్సంపేటకు చెందిన వెంకటేశ్వర ఆస్పత్రికి చెందినదని తెలిసింది.

గీత కార్మికుడికి గాయాలు



నల్లబెల్లి : మోకు జారడంతో తాటిచెట్టు నుంచి కింద పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కన్నారావుపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తండా రాంబాబు తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారింది. గాయాలపాలైన ఆయన్ను స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటకు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ పెరుగు కృష్ణమూర్తిని అతడి తల్లి కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత కొమురమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి తదితరులున్నారు.

ద్విచక్ర వాహనదారుడిపై కోతుల దాడి

వర్ధన్నపేట : ద్విచక్ర వాహనదారుడిపై కోతులు దాడి చేసిన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పరశురాములు అనే వ్యక్తి మహబూబాబాద్ నుంచి వరంగల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కోతులు గుంపుగా వచ్చి దాడి చేశాయి. దీంతో పరశురాములు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఆయన కాళ్లకు, చేతులకు గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

‘చైర్మన్ నియామకంలో అడ్డంకులు సరికాదు’

వర్ధన్నపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి చైర్మన్ నియామకంలో అడ్డంకులు సృష్టించడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఈరెల్లి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్ నియామకంలో కట్ట్యాలకు చెందిన కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నరుకుడు వెంకటయ్యకు ఎమ్మెల్యే నాగరాజు అవకాశం కల్పించగా కొందరు అడ్డుతగులుతున్నారని ధ్వజమెత్తారు. వెంకటయ్యకు అవకాశం కల్పించాలని ఆలోచిస్తుండడంపై ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అడ్డంకులు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాగరాజును కోరారు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

పర్వతగిరి : మండల కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోడేటి దయాకర్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం దళితులు ఎదుర్కొంటున్న అసమానతలు, దాడులు, దౌర్జన్యాలు, తదితరాలపై పోరాడుతోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి యాకూబ్, నాయకులు మునిగె కుమారస్వామి, దుబ్బెర సురేందర్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీసా సభలో పనుల గుర్తింపు

నర్సంపేట రూరల్ : మండలంలోని ఏజెన్సీ గ్రామమైన ముత్యాలమ్మతండా గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం నిర్వహించిన పీసా గ్రామ సభలో పలు అభివృద్ధి పనులు గుర్తించారు. ఎంపీఓ రామ్మోహన్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు బానోత్ రాములు, కార్యదర్శి జాటోతు రాంచందర్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ, సీఎం గిరివికాస్, ఎన్ఆర్ఈజీఎస్ వర్క్, జీపీ భవనం, ఆర్ఓఎఫ్ఆర్ పనులు గుర్తించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సభలో కమిటీ సభ్యులు లకావత్ రవి, జాటోతు లక్ష్మణ్, భూక్య జీవన్, భూక్య సంతోశ్, జాటోతు రవి, జాటోతు బీమ్లానాయక్, ఈరు పాల్గొన్నారు.

‘విలువిద్యను స్పోర్ట్స్ హబ్‌లో చేర్చాలి’

గీసుకొండ : విలువిద్య (ఆర్చరీ)ని స్పోర్ట్స్ హబ్‌లో చేర్చాలని ఆదివాసీ తోటి తెగ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడడారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పోర్ట్స్ హబ్‌ను ఇటీవల ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసీల జీవన విధానంలో భాగంగా ఉన్న విలువిద్యకు గుర్తింపు తీసుకొచ్చే దిశగా రాష్ట్ర మంత్రి సీతక్క చొరవ చూపాలని కోరారు.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని పూజలు

రాయపర్తి : ఇటీవల గాయపడిన కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ మండలంలోని గన్నారంలో దుర్గామాతకు నాయకులు శనివారం పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జనగాం యాకయ్య, జనగాం భాస్కర్, జనగాం కొమురయ్య, జన్నపురెడ్డి నవీన్‌రెడ్డి, అల్లాడి రాజు, అబ్బరబోయిన నర్సయ్య, రాములు, రడపాక దానయ్య, ఎల్లయ్య, భిక్షపతి, జనగాం రాజు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల ఆర్థికసాయం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన అలుగునూరి రాజుకు అతడి బాల్యమిత్రులు శనివారం రూ.8,200 ఆర్థికసాయం అందజేశారు. తొలుత రాజును అతడి తండ్రి సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా పరామర్శించారు. అనంతరం సమ్మయ్య చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు.

కళాకారుడికి..

వర్ధన్నపేట : మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన కళాకారుడు ఆకుల పెల్లి కరుణాకర్ కాలుకు ఇన్ఫెక్షన్ అయి ఇబ్బంది పడుతుండగా వైద్యం కోసం తోటి కళాకారులు కందిక సుధాకర్, వల్లందాసు లక్ష్మణ్, వేల్పుల ప్రవీణ్ శనివారం రూ.7 వేల సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కరుణాకర్‌కు ప్రభుత్వమే మెరుగైన వైద్యం చేయించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మడిపెల్లి రాజమౌళి, మాజీ వార్డు సభ్యుడు రంగారావు, తదితరులు పాల్గొన్నారు.